


ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జాడ కనిపించలేదు. జిల్లాలో ఎక్కడా రోడ్లను పట్టించుకోలేదు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసిన దాఖలాల్లేవు. గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యం, ఇసుక అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను ఆ పార్టీ నేతలు ప్రోత్సహించారు. రౌడీయిజం, భూ ఆక్రమణలతో ప్రజలు భయకంపితులయ్యారు. సమయం కోసం వేచి ఉండి, ఓటుతో బుద్ధి చెప్పారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలనూ టీడీపీ కైవసం చేసుకుంది. జిల్లాలోని పుంగనూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వల్ప ఓట్లతో బయటపడాల్సి వచ్చింది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన నేపథ్యంలో చక్కబెట్టుకోవడం సాధారణ విషయం కాదు. అభివృద్ధితో పాటు పాత మరకలను తుడిచిపెట్టడం కొత్త ఎమ్మెల్యేలకు సవాలే. ఈ క్రమంలో టీడీపీ ఎమ్మెల్యేల తొలి ప్రాధాన్యతాంశాలను ఆంధ్రజ్యోతి అందిస్తోంది. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

కొత్త ఎమ్మెల్యేల ప్రాధాన్యం



కుప్పం

మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతా..


చంద్రబాబు

కుప్పంలో ఇకపై రౌడీయిజం, గంజాయి, అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలు ఉండవు. ప్రశాంత వాతావరణం తీసుకొస్తా. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిస్తా. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తెస్తా. ఏడాదిలోగా హంద్రీనీవా పూర్తి చేసి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా. ఔటర్ రింగు రోడ్డును పూర్తి చేస్తా. రాళ్లబుదుగూరు, మల్లానూరును కొత్త మండలాలుగా చేస్తా. ఒక్కో మండలానికి రూ.10 కోట్లు, గ్రామ పంచాయతీకి రూ.కోటి ఇచ్చి అభివద్ధి చేస్తా. మొత్తంగా కుప్పాన్ని దేశంలో మోడల్ నియోజకవర్గంగా మారుస్తా.

పలమనేరు

ఆగిన అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..


అమరనాథరెడ్డి

మంత్రిగా నేను మంజూరు చేయించిన అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆపేసింది. వాటిని మళ్లీ ప్రారంభించడమే నా మొదటి లక్ష్యం. చాలా చోట్ల గ్రామీణ రోడ్ల అభివృద్ధి ఆగిపోయింది. వి.కోటలో మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, మార్కెట్ యార్డుల అభివృద్ధి, కైగల్ రిజర్వాయర్, ఎస్సీ, బీసీ, కాపు భవనాలు, చెక్‌డ్యాంల నిర్మాణం, రాయలపేట-మాధవరం రోడ్డు పనులు, పలమనేరులో ఆడిటోరియం నిర్మాణం తదితర పనులకు మొదటి ప్రాధాన్యమిస్తా.

చిత్తూరు

ప్రధాన ఆస్పత్రిని ప్రక్షాళన చేస్తా..


గురజాల జగన్మోహన్

జిల్లా కేంద్రమైన చిత్తూరులో ప్రధాన ఆస్పత్రిని ప్రక్షాళన చేయాల్సి ఉంది. అందులో భాగంగానే ఇటీవల తనిఖీలు చేసి, పరిస్థితులు తెలుసుకున్నా. రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడమేగాక మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటా. రాష్ట్రంలోనే తొలి అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసిన ఘనత నాకు దక్కింది. డ్రగ్స్, గంజాయి, కల్తీ మందు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చేస్తా. అదే నా ప్రథమ లక్ష్యం. పాలనలో చిత్తూరు ప్రజలకు మంచి మార్పు చూపిస్తా.

జీడీ నెల్లూరు

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి


థామస్

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తాను. చాలా గ్రామాల్లో శుద్ధనీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించా. 255 మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నియోజకవర్గానికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తా. అసంపూర్తిగా ఉన్న ఆస్పత్రి భవనాలను పూర్తి చేయించి, గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తా. ఇవన్నీ రెండేళ్లలోగా పూర్తి చేస్తా.

నగరి

శాంతి భద్రతలపై దృష్టి సారిస్తా..


గాలి భానుప్రకాష్

వైసీపీ హయాంలో మట్టి, ఇసుక అక్రమ వ్యాపారాలు జోరుగా సాగాయి. ఇకపై అలాంటివి సాగనివ్వను. నియోజకవర్గంలో గంజాయి అనే మాట వినిపించకుండా చర్యలు తీసుకుంటా. ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఇష్టానుసారం ఆక్రమించుకున్నారు. దీనిపై విచారణ జరిపి, భూములను రక్షించడమేగాక బాధ్యులపై చర్యలు తీసుకుంటా. బడుగు బలహీన వర్గాల వారికి చెందిన భూములకు రక్షణ కల్పిస్తా. భూదందాలు, ఆక్రమణలు జరగకుండా చూస్తా.

పూతలపట్టు

మామిడి రైతుల కోసం పోరాటం


మురళీమోహన్

ఎవరు అధికారంలో ఉన్నా మామిడి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ఓ అథారిటీని నియమించేందుకు ప్రయత్నిస్తా. గతేడాది మామిడి ధర, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన ధరను ఈ అథారిటీయే నిర్ణయించే అధికారం ఉంటుంది. నియోజకవర్గంలో జీవ నదులు లేకపోవడంతో కనీసం రెండు రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తాను. కాణిపాకం మాస్టర్ ప్లాన్ అమలు చేయడంతో పాటు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పిస్తా.


ధ్వంసమైన టమోటా పంట


విరిగిపోయిన మామిడి చెట్లు

దేవళంపేటలో గజ దాడులు

- ధ్వంసమైన టమోటా, మామిడి, కొబ్బరి, అరటి, చెరకు పంటలు

కల్లూరు, జూన్ 29: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. వంకాయలపాటివారిపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు టమోటా, మామిడి, అరటి, చెరకు, కొబ్బరి పంటలపై దాడులు చేశాయి. వీకేపల్లిలో రెడ్డిశేఖర్ నాయుడుకు చెందిన ఎకరా టమోటా పంటను ధ్వంసం చేశాయి. కొబ్బరి, చెరుకు పంటలను విరిచేశాయి. అరటిచెట్లను తినేశాయి. చలపతినాయుడుకు చెందిన మామిడి, అరటి, పంటలను నాశనం చేసిన ఏనుగులు డ్రిప్ పైపులు, గేటువాల్వ్‌లను విరిచేశాయి. మామిడితోటకు ఏర్పాటు చేసిన ఇనుపగేటును ధ్వంసం చేశాయి. రెండు రోజుల క్రితం ఇదే రైతులకు చెందిన టమోటా, మామిడి పంటలను నష్టపరిచాయి. దీంతో బాధితులు లబోదిబో మంటున్నారు. నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

బంగారుపాళ్యం : మండలంలోని గోవర్ధనగిరి సమీపంలో గల పంటలను శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు నాశనం చేసింది. సుదర్శన్ నాయుడుకు చెందిన మామిడి తోటలో సుమారు 10 చెట్లను విరిచేసింది. రెండు టన్నుల మామిడి కాయలను నేలరాల్చింది.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: జిల్లావ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం వెలగపూడి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జూలై ఒకటో తేదీనే వందశాతం పింఛన్ పంపిణీ పూర్తి చేస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ తులసి, ఎల్డీఎం హరీష్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో తక్కువ ధరకే కందిపప్పు

నాలుగు మండలాల్లో టమోటా విక్రయాలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: ధరల నియంత్రణలో భాగంగా జూలై 2వ తేదీ నుంచి రైతుబజార్‌లో తక్కువ ధరకే కందిపప్పు విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం జేసీ ఛాంబర్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. బహిరంగ మార్కెట్లలో కందిపప్పు ధర రూ.170 - రూ.180 మధ్య ఉందని, ప్రజల సౌకర్యార్థం రైతు బజార్ల ద్వారా రూ.165కే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెనుమూరు, కార్వేటినగరం, గంగాధరనెల్లూరు, నగరి మండలాల్లో మొబైల్ వాహనాల ద్వారా తక్కువ ధరకు టమోటా విక్రయించేలా చర్యలు చేపడుతున్నట్లు జేసీ వివరించారు.

రేపటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

- ఆగస్టులో రెండు నెలల పంచదార, కందిపప్పు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: జిల్లాలోని 5.44 లక్షల రేషన్ కార్డుదారులకు సోమవారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేయనున్నట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు. జూలై నెలకు సంబంధించి పంచదార, కందిపప్పుతో కలిపి ఆగస్టులో రెండు నెలల కోటా అందజేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం గత అక్టోబరు నుంచి కందిపప్పు ఇవ్వలేదు. పైగా తూకాల్లో తేడాలు ఉన్నాయన్న ఆరోపణలు రావడంతో 10 రోజుల క్రితం జేసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 14 బృందాలు ఎంఎల్ పాయింట్లలో తనిఖీలు చేయగా వాస్తవమేనని తేలింది. సరఫరా చేసిన కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు స్టాకును పంపిణీ చేయరాదని ఆదేశించారు.

జాతీయ లోక్ అదాలత్‌తో ఉచిత న్యాయం

- జిల్లా జడ్జి భీమారావు


కక్షిదారులకు పత్రాలు అందిస్తున్న జిల్లా జడ్జి

చిత్తూరు లీగల్, జూన్ 29: జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు ఉచిత న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు 13 మండల న్యాయసేవ అధికార సంస్థల ఆధ్వర్యంలో 13 బెంచీల ద్వారా కేసులు పరిష్కరించినట్లు చెప్పారు.

1,336 కేసుల పరిష్కారం

చిత్తూరు లీగల్, జూన్ 29: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన లోక్ అదాలత్ ద్వారా 1,336 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో వాయల్పాడు 39, తిరుపతి 256, తంబళ్లపల్లి 19, శ్రీకాళహస్తి 103, సత్యవేడు 34, పుత్తూరు 78, పుంగనూరు 48, పీలేరు 56, పలమనేరు 48, పాకాల 16, నగరి 38, మదనపల్లె 90, కుప్పం 78, చిత్తూరు 180, పీఎల్సీ(ప్రీ లిటిగేషన్ కేసులు) 253 ఉన్నాయి.

90,288 పట్టాదారు పాసు పుస్తకాలు వెనక్కి..

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ ఫొటోతో జిల్లాలో పంపిణీ చేసిన భూహక్కు పత్రాల (పట్టాదారు పాసు పుస్తకాలు)ను వెనక్కి తీసుకోనున్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం పేరుతో గత ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకాన్ని అమలు చేసింది. జిల్లావ్యాప్తంగా మూడు దశల్లో 307 గ్రామాల్లో 3,83,744.93 ఎకరాల భూముల రీసర్వే జరిపినట్లు జిల్లా యంత్రాంగం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 90,288 మంది రైతులకు భూహక్కు పత్రాలు (పాసు పుస్తకాలు) మంజూరు చేశారు. జగన్ ఫొటో ఉన్న పాసు పుస్తకాలను చాలామంది రైతులు వ్యతిరేకించారు. మరికొన్ని చోట్ల వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పంపిణీ ఆపేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు వాటి స్థానంలో రాజముద్రతోనే పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల కుప్పం పర్యటనలో ప్రకటించారు. దీంతో ఇంతవరకు జగన్ ఫొటోతో పంపిణీ చేసిన భూహక్కు పత్రాలను పూర్తిగా వెనక్కి తీసుకోనున్నారు.

సర్వేరాళ్ల సంగతేంది?

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 307 గ్రామాల్లో భూములకు 3,09,684 సరిహద్దు రాళ్లను నాటారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4.19 కోట్లు మంజూరు చేసింది. జగన్ ఫొటో ఉన్న సర్వేరాళ్లను పాతొద్దని రైతులు అడ్డుకోవడంతో కొన్నిచోట్ల పొలాల్లోనే వాటిని పడేశారు. వీటి స్థానంలో కొత్త ప్రభుత్వం నాలుగైదు సైజుల్లో రాళ్లను తయారు చేసి, వాటిలో ఏదో ఒకటి ఆమోదించనున్నట్లు సమాచారం.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం



సాత్విక, మహిత, యుగంధర్, యశ్వంత్, లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

రెండు నెలలు 'స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్'



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: రానున్న రెండు నెలలు స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్ నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన గోడపత్రికను వైద్యాధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఇంటింటి సర్వే చేసి ఐదేళ్లలోపు పిల్లలకు రెండేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. విరేచనాలతో బాధపడే పిల్లలకు ఓఆర్ఎస్‌తో పాటు 14 రోజులకు సరిపడే జింక్ మాత్రలు అందించాలన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే చిన్నారులను వైద్యులకు రెఫర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, డీఐవో డాక్టర్ వెంకటప్రసాద్, పీఎంవో అనిల్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు హర్షవర్ధన్, శ్రీనివాసులు, జయరాములు, శ్రీవాణి పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత



గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: కలెక్టరేట్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), వీవీప్యాట్లను ఉంచిన గోదాములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి గోదాములను పరిశీలించారు. ఈవీఎంల భద్రత, సీసీ కెమెరాల పనితీరును టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి నాయుడు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీ సూచనల మేరకు మూడునెలలకోసారి రాజకీయ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేస్తున్నామన్నారు. వర్షాకాలం తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. డీఆర్వో పుల్లయ్య, రాజకీయ ప్రతినిధులు పరదేశి (కాంగ్రెస్), సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ), గంగరాజు (సీపీఎం), ఎన్నికల విభాగ అధికారులు వారి వెంట ఉన్నారు.

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతలకు బహుమతులు అందజేత




తిరుపతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అనే అంశంపై ఆంధ్రజ్యోతి నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు శనివారం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నగదు బహుమతులను అందజేశారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల అంచనాలతో కూపన్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అలావచ్చిన వేలాదికూపన్లనుంచి ఇటీవల లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపికచేశారు. తిరుపతిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన పి.శ్రీనివాసులు ప్రథమ బహుమతిని, అలాగే మూడు ద్వితీయ బహుమతులను తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీకి చెందిన సీఆర్ ఖాదర్ బాషా, తిరుపతిలోని కుమ్మరతోపుకు చెందిన వి.మురళీకృష్ణ, చిత్తూరు గ్రీమ్స్‌పేటలోని గాయత్రీనగర్‌కు చెందిన ఈఎం ప్రసాద్‌లకు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలో గెలుపొందిన ఐరాలకు చెందిన పుల్లూరు మాధవన్ కూడా నగదు బహుమతి స్వీకరించారు.బ్రాంచ్ మేనేజర్ సురేష్ రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ గ్యాస్ లీకేజీతో కలకలం

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం కలకలం సృష్టించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దనున్న ఈడీపీ ఆఫీస్‌లో శ్రీవారి దర్శన, ఆర్జితసేవల టికెట్లు, గదుల కేటాయింపు వంటి సమాచారాన్ని పొందుపరుస్తారు. శనివారం ఉదయం ఈడీపీ ఆఫీస్‌లోని ఓ ఏసీ కంప్రెసర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఫైర్ అలారం మోగింది. దీంతో విధుల్లోని సిబ్బంది ముందు జాగ్రత్తగా ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని ఏసీని పరిశీలించారు. ఏసీ నుంచి గ్యాస్ మాత్రమే లీకయ్యిందని, ఎలాంటి అగ్నిప్రమాదం జరగలేదని చెప్పడంతో ఈడీపీ కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వంలో దర్శన, ఆర్జితసేవా టికెట్ల కేటాయింపులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల స్టేట్ విజిలెన్స్ బృందం సోదాలు చేసి పలు రికార్డులను తీసుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నట్టు సమాచారం.

రైతాంగానికి ఇబ్బంది లేకుండా
విద్యుత్ సరఫరా చేస్తాం
ఎస్ఈ సురేంద్ర నాయుడు



తిరుపతి(ఆటోనగర్), జూన్ 29: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) పి.సురేంద్ర నాయుడు వెల్లడించారు. తిరుపతిలోని తన కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతుల కోరిక మేరకు రెండు విడతలుగా సరఫరా చేస్తున్నాయని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ఏ గ్రూపులో రోజూ ఉదయం8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రాత్రి12 నుంచి2.30 గంటల వరకు సరఫరా చేస్తున్నామన్నారు. అదే బీ గ్రూపులో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందని వివరించారు. రైతుల కోరిక మేరకే రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా మొత్తం ఏ గ్రూపులో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, బీ గ్రూపులో ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. జిల్లాలో 1,133 వ్యవసాయ విద్యుత్ ఫీడర్లు ఉన్నాయన్నారు. పగలు 675, రాత్రి 485 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు తెలియజేశారు. 6,184 మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. హెచ్‌టీ, ఎల్‌టీ పరిశ్రమలకు జూలై నెలాఖరులోపు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ తీగల సమస్యలు ఉంటే సమీప సబ్‌స్టేషన్లలోని ఫిర్యాదు పుస్తకాల్లో నమోదు చేయాలని కోరారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీనెంబరు 1912 ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్ ఈఈ శ్రీనివసులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో సబ్సిడీ వాహనాలు

- ఐదేళ్లుగా లబ్ధిదారులకు పంపిణీ చేయని వైసీపీ ప్రభుత్వం





కలెక్టరేట్‌లో ముళ్లపొదల్లో ఉన్న వాహనాలు

చిత్తూరు, జూన్ 29: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద ఎస్సీలకు సబ్సిడీ కింద మంజూరైన వాహనాలు ముళ్ల పొదల్లో తుప్పు పట్టిపోతున్నాయి. ఐదేళ్ల కిందట మంజూరైన ఆ వాహనాలను పంపిణీ చేసేలోపు ఎన్నికల కోడ్ వచ్చింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం ఎస్సీలను ఆదుకోవాలనే ఉద్దేశంతో నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ) పథకం కింద కార్లు, ఎక్సకవేటర్లు, ట్రాక్టర్లు, గల్పర్లు, మిని ఎక్సకవేటర్లు మంజూరు చేసింది.2019లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ఏడాది మంజూరైన వాహనాలను కలెక్టరేట్‌లో ఉంచారు.వైసీపీ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు టీడీపీ సానుభూతిపరులన్న భావనతో వాటిని పంపిణీ చేయలేదు. బెనిఫిషరీ కాంట్రిబ్యూషన్ కింద బ్యాంకుల్లో డబ్బులు చెల్లించిన లబ్ధిదారులంతా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు.

ఆఫ్‌లైన్‌లో వైసీపీ వారికి కట్టబెట్టారు..

టీడీపీ హయాంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుని ఆ వాహనాల్లో కొన్నింటిని వైసీపీ సానుభూతిపరులకు పంపిణీ చేసేశారు. ఉమ్మడి జిల్లాకు మూడు గల్పర్లు మంజూరు కాగా రెండింటిని పుంగనూరుకు, మరొకటి తిరుపతికి తీసుకెళ్లారు.

బినామీ పేరుతో రెండు కార్లు కాజేశారు..

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన ఓ అధికారి బినామీ పేర్లతో రెండు ఇన్నోవా కార్లను తీసుకున్నట్లు ఆ శాఖ ఉగ్యోగులే చెబుతున్నారు. 2019 ఎన్నికల ఏడాది కావడంతో టీడీపీ ప్రభుత్వం వంద వరకు ఇన్నోవా కార్లను మంజూరు చేసింది. నగరి నియోజకవర్గంలో ఓ లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకున్నా ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదని అధికారులు చెప్పడంతో వెళ్లిపోయాడు. అయితే కొన్ని రోజుల తర్వాత అదే వ్యక్తికి కారు తీసుకున్నందుకు డ్యూ కట్టాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోటీసులు పంపారు. తీసుకోని కారుకు డ్యూ ఎందుకు కట్టాలంటూ అతను అధికారులతో వాగ్వాదానికి దిగాడు. సర్దిచెప్పిన అధికారులు ఆ కారు ఎవరికి ఇచ్చారో ఇప్పటికీ తేల్చని పరిస్థితి.

పడకేసిన డబుల్ డెక్కర్ !

రూ2.5 కోట్ల ప్రజాధనం వృథా



చిన్నయ్యగారు మోజుపడి ప్రజల సొమ్ముతో కొన్న రెండంతస్తుల బస్సు షెడ్డుకు చేరింది. తిరుపతి నగరంలో ఎర్రెర్రని నిగనిగలతో డబుల్ డెక్కర్ తిరుగుతూ ఉంటే ఎక్కడానికి జనం ఎగబడతారని వేసిన అంచనా తలకిందులైంది. భూమన అభినయ్ డిప్యూటీ మేయర్‌గా ఉన్నపుడు దాదాపు రూ2.5కోట్ల ప్రజాధనం పోసి తిరుపతి కార్పొరేషన్ కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోయింది. గత ఏడాది ఆగస్టు 8న రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులతో ఈ బస్సును కొనాలని కౌన్సిల్లో ప్రతిపాదించారు. ఆగమేఘాల మీద బస్సును కొనేశారు. మరి తిప్పేదెలా అని సందేహం వచ్చింది. ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. వారు నిరాకరించడంతో కార్పొరేషనే బస్సును నడిపి టికెట్లు వసూలు చేయాలని నిర్ణయించుకుంది. ఇరుకురోడ్ల నగరంలో ఇంతెత్తు బస్సు తిప్పడం కష్టం కావడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నరికి నేలకూల్చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా బస్సు ఛార్జీ రూ.50 అని నిర్ణయించారు. ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుందనుకున్నారు కానీ, రోజుకు పదిమంది కూడా ఎక్కలేదు. దీంతో బస్సును కొంతకాలం ఉచితంగానే తిప్పారు.అయినా జనం ఎందుకో పెద్దగా ఎక్కలేదు. ఇంతా చేస్తే బస్సుకు రిజిస్ట్రేషనే లేదు. ఏదైనా తేడా వస్తే తమ నెత్తికి వస్తుందని భయపడి, రవాణ అధికారులు అభ్యంతరపెట్టడంతో బస్సును బయటకు తీయడం మానేశారు. ప్రస్తుతం కార్పొరేషన్ చెత్త వాహనాలు పార్క్ చేసే వినాయకసాగర్ పక్కన ఈ ఎర్రబస్సు ఈసురోమంటూ నిలబడి ఉంది.

> బస్సు పొడవు : 9 మీటర్లు
> ఎత్తు : 4.5 మీటర్లు
> వెడల్పు : 9 అడుగులు
> సీట్ల సామర్థ్యం : 65
> కొనుగోలు ధర: రూ2.14కోట్లు(6శాతం పన్ను అదనం)

4 సెట్విన్ బస్సులు వచ్చేవి

తిరుపతిలో సిటీ బస్సులే లేకుండా పోయాయి. గతంలో తిరుచానూరు, చంద్రగిరి, రేణిగుంటలకు నగరం లోపలి నుంచి సిటీ బస్సులు ఇబ్బడిముబ్బడిగా తిరిగేవి. నగరంలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో వీటిని తగ్గించేశారు. జనం ఆటోల మీదే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. రూ.కోట్ల ఖర్చుతో సోకుల బస్సులు కొనే బదులు చిన్న సైజు సెట్విన్ బస్సులు కొని నగరంలో తిప్పితే ఆటోలు, బైకుల సంఖ్య కూడా తగ్గేది. ట్రాఫిక్ అవస్థలు తప్పేవి. ప్రజలకూ రవాణా అందుబాటులో ఉండేది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో తులసిరామిరెడ్డి మృతదేహం

గంగాధరనెల్లూరు, జూన్ 29: ట్రాక్టర్ ఢీకొని రైతు మృతిచెందిన ఘటన మండలంలోని ఒడ్డుపల్లె చెరువుకట్టపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడి భార్య చెప్పిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కోటాగరం పంచాయతీ ఒడ్డుపల్లె గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు తులసిరామిరెడ్డి(34) పొలం నుంచి ఆవులను పట్టుకుని ఇంటికి వస్తున్నాడు. చెరువుకట్టపై అదే గ్రామానికి చెందిన చిరంజీవిరెడ్డి ట్రాక్టర్‌లో వస్తున్నాడు. ట్రాక్టర్ శబ్దానికి ఆవులు బెదిరిపోయాయి. వాటిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ తులసిరామిరెడ్డిని ఢీకొంది. ఆయన అక్కడిక్కక్కడే మృతిచెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అంజినేయులురెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనతో ఒడ్డుపల్లె గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 66,256 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,087 మంది తలనీలాలు సమర్పించారు.

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు ప్రారంభం



సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29: విద్యా కేంద్రాలన్నీ విద్యార్థి ఉద్యమ నిలయాలు కావాలని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు శనివారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. రెండ్రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్ వేదికైంది. విద్యార్థి, రైతాంగ ఉద్యమ అమరులైన అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్‌లకు తొలుత సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో అధికార పార్టీకి ఊడిగం చేసేవారికి గత వైసీపీ ప్రభుత్వం పదవులు కట్టబెట్టిందని మండిపడ్డారు. ఎస్వీయూనివర్సిటీలో గతంలో ఎంపీ మిథున్‌రెడ్డి కటౌట్ ఏర్పాటు చేయడం వంటి సంఘటనలు ఉదాహరణగా చెప్పారు. వర్సిటీల్లో రాజకీయ ప్రభావాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. చట్టసభలు కోటీశ్వరులతో నిండి పోయాయన్నారు. అందువల్ల విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. నీట్ వ్యవహారంపై ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయపడ్డారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకరరెడ్డి నిలువెత్తు ఫ్లెక్సీని ఎస్వీయూ పరిపాలనా భవనానికి పెట్టడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. వర్సిటీల్లో ఇలాంటి సంస్కృతిని ఏ పార్టీ అధికారంలో ఉన్నా విడనాడాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ పాండా మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ అజెండాను పాఠ్యాంశాల్లోకి ప్రవేశపెడుతున్నారని, దీనిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్ మాట్లాడుతూ.. అతుల్‌కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్ పోరాట పటిమ ఈ తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సమావేశాల్లో దేశంలోని విద్యారంగ సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోంది. ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సంఘమిత్ర, అమీన్ హంజా, మహేష్ కుంజం, జాతీయ కార్యదర్శులు కబీర్, షాహిద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి, నాయకులు ఫణీంద్ర, ఉదయ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, యూనివర్సిటీ నాయకులు చిన్న, చంద్ర, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కడియాల వెంకటరమణ, ప్రసాద్, తూపల్లె జనార్దన్, మోహన్‌కుమార్‌రాజు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కాళయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సినీ రంగం కష్టాలు తెలిసిన వ్యక్తి పవన్‌కల్యాణ్ - సినీ నటుడు సుమన్



గోవిందరాజస్వామి ఆలయంలో సుమన్

తిరుపతి అర్బన్, జూన్ 29: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సినీ నటుడు సుమన్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం గోవిందరాజస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులకు సొంతూళ్లలోనే ఉద్యోగ అవకాశాలు లభించేలా సీఎం కృషి చేయాలని కోరారు. సినీ పరిశ్రమలో చాలామంది ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని కూడా ఆదుకోవాలన్నారు. స్టూడియోలు నిర్మిస్తే వెండి తెరతోపాటు బుల్లితెర పరిశ్రమ మరింత మెరుగుపడుతుందన్నారు. తిరుపతిని టెంపుల్‌సిటీగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. సినీ రంగం ఎదుర్కొనే కష్టాలు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలుసునన్నారు. ప్రస్తుత పరిస్థితుల నుంచి త్వరలోనే సినీ రంగం తేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన సినీ నటుల రాజీనామాపై స్పందిస్తూ.. అది వారి వ్యక్తిగతమన్నారు. రాజకీయాల్లో అందరినీ సంతృప్తిపరచడం చాలా కష్టమన్నారు. ఎవరికి తలరాత ఉంటే వారికి మాత్రమే పదవులు లభిస్తాయన్నారు.

ఏనుగుల సంచారంతో అటవీశాఖ అప్రమత్తం

ఏడో మైలు వద్ద 30 మంది సిబ్బంది ఏర్పాటు

మంగళం, జూన్ 29: తిరుమల మొదటి ఘాట్‌లోని ఏడో మైలు వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రోడ్డుకు సమీపంలోని అటవీప్రాంతానికి ఏనుగులు శుక్రవారం రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఇవి రోడ్డుపైకి రాకుండా అటవీశాఖ సిబ్బందిని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. వీరు.. ఏనుగులు గుంపు అటువైపు రాకుండా వాటిని అడవిలోకి తరమడంతోపాటు భక్తులను అప్రమత్తం చేయనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు 15మంది, రాత్రి నుంచి ఉదయం వరకు మరో 15మంది సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారు. వీరితోపాటు మరి కొంతమంది టీటీడీ సిబ్బంది కూడా ఉంటారు.

> **శేషాచల ప్రాంతంలోనే ఏనుగుల గుంపు**
>
> ఏడో మైలు వద్దకు వచ్చిన ఏనుగుల గుంపు శేషాచల కొండల్లోని అటవీ ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. కొంతకాలం క్రితం ఏనుగుల ఇక్కడకు వచ్చి వెళ్లాయి. అవ్వాచారి కోన సమీపంలో ఏరు ఉండటంతో సమీప ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం ఎత్తయిన కొండలతో కాకుండా చదునుగా ఉండటం.. ఆహారం, నీరు దొరుకుతుండటంతో తరచూ ఇవి ఈ ప్రాంతానికి వస్తున్నాయి. ఏనుగులు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నాం. ఏదేమైనా వీటిపై నిఘా ఉంచడానికి 15మంది చొప్పున 30మందితో రెండు బృందాలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
>
> - శ్రీనివాసరావు, సబ్ డీఎఫ్‌వో, తిరుపతి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

లోక్ అదాలత్‌లో 85 కేసుల పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న జడ్జి ఆరీఫా షేక్

కుప్పం/ పలమనేరు/ పుంగనూరు, జూన్ 29: కుప్పం న్యాయస్థానం ఆవరణలో శనివారం కుప్పం జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో వివిధరకాలైన 85 కేసులు పరిష్కరించారు. 11 సివిల్ కేసులను పరిష్కరించి రూ.17,53,235 విలువ కలిగిన వివాదాలు పరిష్కరించారు. అలాగే 64 క్రిమినల్ కేసుల్లో రూ.24,16,39 విలువ కలిగిన వివాదాల పరిష్కారం జరిగింది. వీటితోపాటు 7 బ్యాక్ పీఎల్సీ కేసులను పరిష్కరించి రూ.5.88 లక్షల వివాదాలు సెటిల్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప, న్యాయ వాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిపై పిల్లలకు అవగాహన కల్పించాలి


వాటర్ ప్లాంటు నిర్వహణపై సూచనలిస్తున్న డా.గిరీషా

సదుం, జూన్ 29: సురక్షిత తాగునీటిపై పిల్లలకు అవగాహన కల్పించాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.గిరీషా సూచించారు. డయేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని నీటి శుద్ధి ప్లాంటును ఆమె పరిశీలించారు. క్లోరినేషన్, శుద్ధి జల తయారీ, నిర్వహణపై పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో వచ్చే డయేరియా, మలేరియా, వైరల్ ఫీవర్ తదితర ఆరోగ్య సమస్యలు, పాటించాల్సిన కనీస ముందస్తు ఆరోగ్య జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, శిఖామణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో 127 కేసుల పరిష్కారం


బ్యాంకు అధికారుల నుంచి కక్షిదారులకు నగదు అందజేస్తున్న జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు, జూన్29: పలమనేరు జవుళివీధిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 127 కేసులు పరిష్కార మయ్యాయి. పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు ఉదయం నుంచి సాయంత్రం వరకు లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారుల వ్యాజ్యాలను సామరస్య వాతావరణంలో పరిష్కరించారు. పలమనేరు న్యాయవాదులు, పోలీసు అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

భార్యను వదిలించుకోవాలని చూస్తున్న భర్త
పోలీసులను ఆశ్రయించిన భార్య

రామకుప్పం, జూన్ 29: రెండోపెళ్లి మోజులో పడి తనను వదిలించుకోవాలని భర్త ప్రయత్నిస్తున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన దమయంతికి రామకుప్పం మండలం బాలఓబనపల్లెకు చెందిన రిషికేశవతో మూడేళ్ల క్రితం పెళ్లయింది. వారికో కుమార్తె ఉంది. ఈ క్రమంలో అతడు రెండో పెళ్లి చేసుకోవాలని భావించాడు. కర్ణాటక రాష్ట్రం చింతామణి ప్రాంతంలో సంబంధం చూశాడు. ఈ నేపథ్యంలో రిషికేశవ, అతని కుటుంబసభ్యులు చెంగప్ప, శిరీష, ప్రేమావతి, అనూరాధలు దమయంతిని తరచూ కొడుతూ వేధించేవారు. ఇంటినుంచి వెళ్లిపోవాలని బెదిరించేవారు. వారిదాడిలో ఆమె చేయి విరిగిపోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లోక్ అదాలత్‌లో 83 కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శిరీష్

పుంగనూరు రూరల్, జూన్29: జాతీయ లోక్‌అదాలత్‌లో 83 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన లోక్‌అదాలత్‌లో 47 క్రిమినల్ కేసులు, 9 సివిల్ కేసులు, 29 బ్యాంకులకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. దీనిద్వారా రూ. 43లక్షలు పరిహారం పంపిణీ చేసినట్లు వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి, న్యాయవాదులు హరినాథరెడ్డి, చెన్నకేశవులు, శివశంకర్‌నాయుడు, బాలాజీ, ఆనందకుమార్ పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సోమల, జూన్ 29: ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 65 రోజులకు గాను రూ.1,16,21,723 నగదు వచ్చినట్లు ఈవో మునిరాజ తెలిపారు. అలాగే బంగారు 60 గ్రాములు, వెండి 1కేజీ 220 గ్రాములు, యూఎస్ డాలర్లు 5, ఒమెన్ 100 బైస, మలేషియన్ రింగిట్ 1 వచ్చినట్లు వివరించారు. ● అలాగే రణభేరి గంగమ్మ దేవస్థానం హుండీ ద్వారా రూ. 78,829 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో పోలీసు సిబ్బంది, దిగువపల్లె వీఆర్వో రాజన్న, ఐసీఐసీ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భీమగానిపల్లెలో పారిశుధ్య పనులు ముమ్మరం



పుంగనూరు రూరల్, జూన్29: పుంగనూరు మండలం భీమగానిపల్లెలో పారిశుధ్యం లోపించినట్లు ఆంధ్రజ్యోతిలో ప్రముఖంగా డైఏరియాలు అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో శనివారం ఉదయాన్నే పంచాయతీ, సచివాలయ, వైద్యసిబ్బంది గ్రామానికి చేరుకుని తాగునీటి బోరుమోటర్ వద్ద లీక్ అవుతున్న పైపులకు మరమ్మతు పనులు చేయించారు. వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీటికి కాల్వలు ఏర్పాటు చేసి బ్లీచింగ్ చల్లారు.

జిల్లా షూటింగ్ బాల్ కార్యవర్గం ఎన్నిక

కుప్పం, జూన్ 29: జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం కుప్పంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా ఎ.మహేశ్, అధ్యక్షునిగా పవన్ కళ్యాణ్, కార్యదర్శిగా పీటీ.వేణుగోపాల్, కోశాధికారిగా పీజీ.సెల్వం, ఉపాధ్యక్షులుగా వెంకటరమణారెడ్డి, లోకనాథం, ఉప కార్యదర్శులుగా యూఎస్.జబీర్, స్వాతి, జమున సలహాదారుగా వివేక్‌లు ఎంపికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బి.వేణు గోపాల్, సురేశ్, మాండవ్య, చన్నకేశవ, పీఎస్.చరణ్‌లను ఎన్నుకున్నారు.

నలుగురు వార్డు మెంబర్ల రాజీనామా

రొంపిచెర్ల, జూన్ 29: రొంపిచెర్ల పంచాయతీకి చెందిన నలుగురు వార్డు మెంబర్లు శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలు ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారికి అందజేశారు. రాజీనామా చేసినవారిలో 1, 2, 5, 7 వార్డులకు చెందిన ఎం.బావాజాన్, ఎస్.జబీనా, ఎన్.చిన్ననాగరాజ, పి.మహమ్మద్‌హుసేన్‌లు ఉన్నారు. కాగా ఇప్పటికే ఈ పంచాయతీలో ముగ్గురు వార్డు మెంబర్లు రాజీనామా చేయడం విదితమే. దీంతో రొంపిచెర్ల పంచాయతీలో మొత్తం 14 మంది వార్డు మెంబర్లకు గాను ఏడుగురు రాజీనామా చేసినట్లయింది.

చెన్నకేశవులస్వామికి విశేష పూజలు

సోమల, జూన్ 29: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవుల స్వామి ఆలయంలో శనివారం భక్తులు మూల విరాట్‌కు విశేష అలంకరణలు చేసి అభిషేక పూజలు చేశారు. పలు భజన సంఘాల సభ్యులు సంకీర్తనలు ఆలపించారు.

టీడీపీ పాలనలోనే ముస్లింల సంక్షేమం

రామకుప్పం, జూన్ 29: రాష్ట్రంలో టీడీపీ పాలనలోనే ముస్లింల సంక్షేమం సాధ్యమవుతుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పత్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనంద రెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మెన్ సీతాపతి, మైనారిటీ సెల్ జిల్లా సభ్యుడు సలాంసాబ్‌లు తెలిపారు. శనివారం రామకుప్పంలోని మక్కా మసీదులో ముస్లింలు టీడీపీ నాయకులను సన్మానించారు.

విద్యా సామగ్రి వితరణ



గంగవరం, జూన్ 29: గంగవరం హైస్కూల్లో 9వ తరగతిలో ప్రతిభ చూపి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయి నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి బాలసుబ్రమణ్యం విద్యాసామగ్రిని శనివారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రూపాదేవి, విశ్రాంత హెచ్‌ఎం పరశురామ్, పెన్షనర్ల సంఘ నాయకులు గురురాజారావు, క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జ్ఞానదీపాలు' పుస్తకాల పంపిణీ

గంగవరం, జూన్ 29: సూక్తులు, సామెతలు, నీతిపద్యాలతో కూడిన 'జ్ఞానదీపాలు' అనే పుస్తకాలను మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు తెలియజేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో గంగవరం ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులుకు ఈ పుస్తకాలను అందించారు. వీరు పాఠశాలలకు అందిస్తారని వివరించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల పంపిణీ

పుంగనూరు రూరల్, జూన్29: పుంగనూరు తహసీల్దార్ కార్యాలయానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలను టీడీపీ, జనసేన నాయకులు శనివారం అందజేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, గంగాధర్, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయాలి


పెన్షన్ల పంపిణీ పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్29 : జూలై ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సకాలంలో జరగాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెన్షనర్ల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 4682 మంది లబ్ధిదారులకు రూ.3.2 కోట్లను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఇవ్వను న్నామని తెలియజేశారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గత మూడు నెలలకు గాను నెలకు వెయ్యి చొప్పున రూ.3వేలు అదనంగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇంటివద్దే పింఛన్లు ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డుల్లో పండుగలా పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులతో పాటు టీడీపీ నాయకులు ఆర్.వి. బాలాజి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చాంద్‌బాషా, ఖాజాపీర్, మాబాషా, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేయండి


కార్యదర్శులతో మాట్లాడుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల, జూన్ 29: ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా అధికారులు పనిచేయాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. శనివారం రొంపిచెర్లలోని తన కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకుల సమక్షంలో ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలన్నారు. గ్రామాలను శుభ్రతగా ఉంచేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. ప్రతి పల్లెలో వీధిలైట్లు వెలగాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా మంచి తాగునీరు అందించాలని సూచించారు. టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, జూనియర్ అసిస్టెంట్ శేషయ్య, కార్యదర్శులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ద్వంద్వ వైఖరికి మోసపోకండి: టీడీపీ


మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

రొంపిచెర్ల, జూన్29: వైసీపీ ద్వంద్వ వైఖరిని మైనార్టీలు గుర్తించాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి అంజాద్‌ఖాన్, రాజంపేట పార్లమెంట్ మైనార్టీ అధికారప్రతినిధి షేక్ కరీముల్లా కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. పుంగనూరులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎన్‌డీఏకి ఓట్లు వేస్తే బీజేపీకి వేసినట్లేనని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారం చేశారని గుర్తుచేశారు. వారితో పాటు పలువురు ముస్లిం మతపెద్దలు అలాగే ప్రచారం చేశారని వివరించారు. అయితే స్పీకర్ ఎన్నికల్లో వైసీపీ ఎంపీలు బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చారని తెలియజేశారు. కేవలం ముస్లిం మైనార్టీల ఓట్ల కోసం రాజకీయం చేసే వైసీపీ వైఖరిని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజంపేట పార్లమెంట్ మైనార్టీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు జి.ఇమ్రాన్‌ఖాన్, హయత్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల భూ కబ్జా
తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు పిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పుంగనూరు, జూన్ 29: పుంగనూరులో తప్పుడు పత్రాలు సృష్టించి వైసీపీ నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని టీడీపీ, జనసేన నాయకులు తహసీల్దార్ శివయ్యకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు పగడాల రమణ, నాగరాజ, మల్లిఖార్జున, సుబ్రహ్మణ్యం, కృష్ణప్ప, అనిల్‌కుమార్ మాట్లాడుతూ మేలుపట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్53/1లో 1.89ఎకరాలు తమకు ఉన్నట్లు తెలిపారు. అయితే తూర్పుమొగసాలకు చెందిన వైసీపీ నేత ప్రభు అదే సర్వే నంబర్‌కు ఫైమాసి నెంబర్ 74పిలో తప్పుడు రికార్డులు సృష్టించినట్లు ఆరోపించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉండటంతో ఆ భూమిలోకి ప్రవేశించకుండా పోలీసులతో బెదిరించారని వాపోయారు. రికార్డులు పరిశీలించి తమభూమిని తమకు స్వాధీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, గంగాధర్, గంగ రాజు, రమణ, జనసేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, వెంకటేశ్, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకుడు ప్రభు మాట్లాడుతూ ఈ భూమి వివాదం కోర్టులో ఉందని తెలియజేశారు.

వికసించిన బ్రహ్మకమలాలు



సోమల, జూన్ 29: సోమల సాయిబాబా ఆలయం వీధిలోని విశ్రాంత ఆర్మీ అధికారి పీఎస్ సోమశేఖర్ ఇంటి ఆవరణంలో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలాలు వికసించాయి. సుమారు 50 పుష్పాలు వికసించడంతో ఆ వీధిలోని ప్రజలు వాటిని ఆసక్తిగా తిలకించారు. ఆ బ్రహ్మకమలాలను సాయిబాబా ఆలయం, స్వయంబేశ్వర స్వామి, వినాయకస్వామి వారి ఆలయాల్లో మూల విరాట్‌లకు సమర్పించి పూజలు చేశారు.

బీసీజీ టీకాలతో
రోగనిరోధక శక్తి పెరుగుతుంది

సోమల, జూన్ 29: బీసీజీ టీకాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కందూరు వైద్యాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం తమ్మినాయనపల్లె, వల్లిగట్ల, కామిరెడ్డివారిపల్లె, నెల్లిమంద సచివాలయాల్లోని ఆరోగ్యకేంద్రాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు భారత ప్రభుత్వం బీసీజీ టీకాలను ప్రవేశపెట్టిందన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి కందూరు పీహెచ్‌సీలో ప్రతి గురువారం ఈ టీకాలను వేస్తామని వివరించారు.

ట్యాంకులను శుభ్రం చేయాలి

సోమల, జూన్ 29: గ్రామపంచాయతీల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని ఎంపీడీవో నారాయణ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వర్షాకాలంలో వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్డీ ఆస్పత్రిలో
10 కిలోల కణితి తొలగింపు



కుప్పం, జూన్ 29: కుప్పంలోని బీఆర్డీ ఆస్పత్రిలో శనివారం ఓ మహిళ కడుపులో పెరిగిన పది కిలోల కణితిని తొలగించినట్లు ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కురుంబేరికి చెందిన పెన్నియమాన్‌ను తీవ్రమైన కడుపు నొప్పితో కుప్పంలోని బీఆర్డీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరింది. ఇక్కడి వైద్యులు పరీక్షలు, స్కానింగ్ చేసి, ఆమె కడుపులో 10 కిలోల బరువు కలిగిన అండాశయం తిత్తి (మాలిగ్నంట్ ఓవరిన సిస్ట్) ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ హరిత ఆధ్వర్యంలో వైద్య బృందం పెన్నియమ్మన్‌కు ఆప రేషన్ చేసి అండాశయ తిత్తిని తొలగించారు. ప్రస్తు తం రోగి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్‌బాబు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ భవాని, ఓటీ సీనియర్ టెక్నీషియన్స్ ధనశేఖర్, చంద్ర శేఖర్, రంజిత్, ఓటీ టెక్నీషియన్స్ దివాకర్, రోజాలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సదుం, జూన్ 29: మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ కలకటవారిపల్లెలో ఆస్టర్ నారాయణాద్రి, శశి ఆర్థో ప్రైవేటు ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మందికి బీపీ, షుగర్ పరీక్షలతోపాటు గుండె, ఊపిరితిత్తుల సంబంధిత జబ్బులకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుమంత్ కుమార్‌రెడ్డి, ధరణీశ్వర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, స్థానిక నాయకులు గౌతమ్ కుమార్ రెడ్డి, అమరనాథ్ పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఎన్నికల నిర్వహణకు అధికారి నియామకం


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్.వి.సుభాష్‌చంద్రబోస్

పలమనేరు, జూన్29 : పలమనేరు ది బాలాజి కో-ఆపరేటివ్ సూపర్ బజార్‌కు ఎన్నికలు నిర్వహించేందుకు పాలకవర్గం రిటైర్డు డిప్యూటీ రిజిస్ట్రార్ బి.వెంకటరమణను నియమించిందని సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు. శనివారం సూపర్ బజార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ బాజార్ పాలక వర్గం పదవీ కాలం ముగిసి ఆరేళ్లకు పైగా అయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం, అంతకు ముందున్న టీడీపీ ప్రభుత్వం సూపర్ బజార్‌కు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీగా తనను నియమించి పదవీ కాలాన్ని పెంచుకొంటూ వచ్చాయన్నారు. పర్సన్ ఇన్‌ఛార్జీ పదవీ కాలం కూడా ఈ ఏడాది ఆగస్టు 4వ తేదీతో ముగియనుందన్నారు. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహించాలని పాలకవర్గం నిర్ణయిం చిందని వివరించారు. ఆ మేరకు అర్హత కలిగిన ఓటర్ల జాబితాను రూపొందించి ఎన్నికల అధికారికి అందజేశామన్నారు. ఓటర్ల జాబితాతో పాటు సూపర్ బజార్ బైలాలు, అడ్మిషన్ రిజిస్టర్, షేర్ క్యాపిటల్ రిజిస్టర్, తాజా మినిట్స్‌బుక్, సూపర్ బజార్ రౌండ్‌సీల్, ఎన్నికల అధికారి సీల్ ఎన్నికల అధికారికి అందజేశామ న్నారు. జూలై 10న సూపర్ బాజార్‌కు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆగస్టు 4న ఎన్నికలు జరగవచ్చని పేర్కొన్నారు.

అంతా పారదర్శకం..

సూపర్ బజార్‌లో అన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని బోస్ స్పష్టం చేశారు. ప్రతి ఏటా ఆడిట్ చేయించడం, మార్చి చివర్లో ఉన్న స్టాకును లెక్కకట్టడం, ఆడిట్ రిపోర్టును మహాజనసభలో ఆమోదం పొందడం జరుగుతోందన్నారు. ఎవరో రాజకీయ దురుద్దేశాలతో చేసిన ఫిర్యాదుతో ఈ నెల 28న అధికారులు తనిఖీలు చేశారని వివరించారు. వారు క్యాష్‌బుక్ మూడు రోజులు పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారని తెలియజేశారు. సూపర్ బజార్ పూర్తిగా పేపర్ లెస్ లావాదేవీలు నిర్వహిస్తోందని, ఒక వేళ కంప్యూటర్‌లు కరప్ట్ అయితే లెక్కలు ఉండాలని మాత్రమే క్యాష్ బుక్‌లో నమోదు చేస్తున్నామని తెలియజేశారు. ఎక్కడా అక్రమాలకు తావులేదని పేర్కొన్నారు. అందరూ ఎన్నికల నిర్వహణకు సహకరించి మంచి పాలక వర్గం ఏర్పాటుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సూపర్ బాజార్ డైరెక్టర్ సత్యమూర్తి పాల్గొన్నారు.

పౌరుల హక్కులకు
భంగం కలగరాదు

పుంగనూరు రూరల్, జూన్ 29: సమాజంలో పౌరుల హక్కులకు భంగం కలిగితే తక్షణమే చర్యలు తీసుకుంటామని పుంగనూరు తహసీల్దార్ శివయ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని మోదుగులపల్లెలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కారించడానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. దళితసంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భూతగాదాలతో దాడి

పుంగనూరు రూరల్, జూన్29: భూతగాదాలతో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని రాగానిపల్లె పంచాయతీ లక్కుంట గ్రామానికి చెందిన నరసింహులు, కదిరప్పకు భూతగాదాలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం కదిరప్ప నరసింహులును రాయితో తలపై కొట్టడంతో గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భక్తులకు కల్యాణ కంకణధారణ

బైరెడ్డిపల్లె, జూన్ 29 : మండలంలోని పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయంలో శనివారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం మొక్కుబడి చేసుకున్న భక్తులకు అర్చకులు శ్రీనివాసాచార్యులు కల్యాణ కంకణధారణ చేశారు. అవివాహితులు ఇక్కడ మొక్కుబడి చేసుకుంటే త్వరగా వివాహాలు జరుగుతాయని భక్తుల విశ్వాసం.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని
చంద్రబాబుకు వినతి

పంగనూరు రూరల్, జూన్29: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు వాల్మీకి సంఘ నేత, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు తెలిపారు. శుక్రవారం విజయవాడలో సీఎంను కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

గుడుపల్లె, జూన్ 29: గుడుపల్లె మండలం వేపమానుకొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అర్చనలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.


గుడివంక ఆలయానికి
రూ.8లక్షల ఆదాయం

గుడుపల్లె, జూన్ 29: గుడుపల్లె మండలం గుడివంక వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాలకు సంబంధించి శనివారం నిర్వహించిన వివిధ వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.8లక్షలు ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం అమ్మకాలు వేలం ద్వారా రూ.5.10లక్షలు, దుకాణాల గేటు వేలం ద్వారా రూ.1.10 లక్షలు, తలనీలాల ద్వారా రూ.2.10లక్షల ఆదాయం వచ్చింది. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు హేమాంబరగౌడు, వెంకటేశ్, భానుమూర్తి, చంద్రప్ప, సుబ్బు, రాజగోపాల్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

రామకుప్పం, జూన్ 29: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ మల్లేష్‌యాదవ్ స్పష్టం చేశారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలిసారి శనివారం రామకుప్పం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం బందార్లపల్లె గ్రామంలోని ప్రజలకు గంజాయి, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సోషల్‌మీడియాలో ఫేక్ లింకులకు స్పందించరాదని సూచించారు. కాగా టీడీపీ నాయకులు మునస్వామి, నారాయణాచారి, చలపతి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, సీతాపతి తదితరులు పోలీసుస్టేషనులో సీఐను మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం


ఆంధ్రాబ్యాంకు మలుపు వద్ద కాలువ పక్కనే పోగుపడ్డ చెత్త

కుప్పం, జూన్ 29: కుప్పం పురపాలక సంఘం పారిశుధ్య లోపంతో అనారోగ్యం పాలైంది. ఎటుచూసినా చెత్త కుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. పెరిగిపోయిన దోమలు, అంటువ్యాధులు వ్యాప్తి చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు.

కుప్పంలోని వీధులలో ఎటుచూసినా చెత్తకుప్పలు పోగులు పడ్డాయి. మురుగు కాలువల్లో పూడిక తీసి రోజులు గడుస్తున్నాయి. ముఖ్యంగా ప్యాలెస్ రోడ్డు ఆంధ్రా బ్యాంకు మలుపు, డీసీసీ బ్యాంకు ముందు, ఎన్జీవో హోమ్ పక్కనుంచి వెళ్లే కాలువ రోడ్డుకు రెండు వైపులా మురుగు కాలువలు చాలా పెద్దవి. ఇవి ప్రధాన మురుగు కాలువలు. పిల్లకాలువలు కొన్ని వచ్చి ఈ కాలువల్లో కలుస్తాయి. ఈ కాలువలోనూ పూడిక తీయలేదు. కనీసం వారం పదిరోజులుగా చెత్త అలాగే పేరుకుపోయింది. ప్లాస్టిక్, కూరగాయలు, ఇతరత్రా వ్యర్థాలు అడ్డుగా పడివున్నాయి. ఎక్కడి మురుగు అక్కడ నిలిచిపోయింది. ఆ పక్కనే చెత్తకుప్పలు పోగుపడ్డాయి. తీసే దిక్కులేదు. పట్టించుకునే అధికారులు లేరు. ఈ కాలువలు, వీధుల్లోనే కాదు.. పట్టణంలోని ప్రతి వీధి డంపింగ్ యార్డులా తయారైంది. పేరుకు మాత్రమే మున్సిపాలిటీ చేసి మౌలిక సదుపాయలు పట్టించుకోని ఫలితమిది. కుప్పంతోపాటు మున్సిపాలిటీలో చేర్చిన మిగిలిన 7 పంచాయతీల పరిస్థితి మరీ అధ్వానం. అంతటా చెత్తలే, పూడిక తీయని కాలువల్లో పేరుకుపోయిన మురుగునీళ్లే. జిల్లాలోని వేరే ప్రాంతాలనుంచి వారానికి ఒకటిరెండుసార్లు మాత్రమే వచ్చి మొక్కుబడిగా విధులు నిర్వహించే అధికారులు, చాలని సిబ్బంది. పెరిగిపోయిన వ్యయాలు. ఫలితంగా పట్టణం మురిగిన చెత్తకుప్పలతో దర్శనమిస్తోంది. మరోవైపు వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు ప్రబలు తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధనా సిబ్బంది



మాట్లాడుతున్న ఎంఈవో గణపతి

గుడిపాల, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ బోధనా సిబ్బంది ఉన్నందున వందశాతం ఉత్తీర్ణత సాధ్యమవుతోందని ఎంఈవో గణపతి అన్నారు. శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ ఖాతుమ్‌బీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ నరహరిపేట హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రారంభించిన సంవత్సరానికే వంద శాతం ఫలితాలు సాధించారన్నారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చేర్పించేలా టీచర్లు చొరవ చూపాలన్నారు. ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చిత్తూరు, జూన్ 29: నగరపాలక సంస్థ పరిధిలోని పింఛను లబ్ధిదారులకు జూలై 1వ తేదీన ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటి దగ్గరే పంపిణీ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలోని 50 డివిజన్లలో పింఛన్ల పంపిణీకి సంబంధించి యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించామన్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నగర పరిధిలో 16,536 మందికి రూ. 11.31 కోట్లు పంపిణీ చేయడానికి 860 క్లస్టర్ల పరిధిలో 350 మంది వార్డు కార్యదర్శుల ద్వారా పంపిణీకి మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. ఏర్పాట్లను సజావుగా చేసినట్లు వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన దళిత సంఘాల నేతలు



చిత్తూరు, జూన్ 29: కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను వివిధ దళితసంఘాల నేతలు శనివారం కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ధనశేఖర్, కదిరవేలు, పి.బాబు, దేవరాజులు, మొగిలయ్య తదితరులు ఉన్నారు.

దోమలను అరికడితే వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనారాయణ

యాదమరి, జూన్ 29: దోమల బెడదను అరికట్టివాటి వల్ల వచ్చే వ్యాధులను దూరం చేస్తామని సీహెచ్‌వో లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మోర్దానపల్లెలో మలేరియా మాసోత్సవాల్లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగంగా దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, వైద్యబృందం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరీక్షలు



పైప్‌లైన్ మధ్యలో శాంపిల్ సేకరణ

విజయపురం, జూన్ 29: బూచివానత్తంలో శనివారం తాగునీటిని తీసుకొని నాణ్యత పరీక్షలు నిర్వహణకు శాంపిల్ తీసుకున్నారని పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ తెలిపారు. గ్రామంలో అంటు వ్యాధులు ప్రబల కుండా, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాలు, చెత్తా చెదారం లేకుండా పారిశుధ్య చర్యలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పనిచేయని వారిపై చర్యలు



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఐరాల, జూన్ 29: ఉపాధి హామీ పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పని చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని డ్వామా పీడీ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన ఐరాల మండలంలోని ముదిగోళం, కొత్తపల్లె పంచాయతీలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ మంది కూలీలు పని చేసేలా టీఏలు చూడాలన్నారు. అక్కడక్కడ కందకాలు తవ్వితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఉపాధి పనులలో కూలీ రూ.275 వచ్చేలా క్షేత్రస్థాయి సహాయకులు చూడాలన్నారు. అదనపు ప్రోగ్రామ్ అధికారి సంధ్యారాణి, ఈసీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోరా...?: ఎమ్మెల్యే



ఫ్యాక్టరీ యజమానులతో ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, జూన్ 29: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టరే ఆదేశించినా ఎందుకు ఆచరణలో పెట్టలేదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులను ప్రశ్నించారు. శనివారం మండలంలో ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలోని గొల్లమడుగు వద్ద ఫుడ్-ఇన్స్ సీకేపల్లి వద్ద టాజా ఫుడ్ ఫ్యాక్టరీల యజమానులతో ఆయన మాట్లాడారు. స్థానిక రైతులకు మొదటి ప్రాధ్యాన్యతనిచ్చానే ఇతర రాష్ట్రాల వారికి టోకెన్లు ఇవ్వాలన్నారు. తేడాలొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఆర్‌ఐ రామసాయి, శంకర్ చౌదరి, మామిడి రైతులు, అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జిగా కేవీఆర్ కుమార్

గుడిపాల, జూన్ 29: గుడిపాల సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా చిత్తూరు సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న కేవీఆర్ కుమార్‌ను శనివారం నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో సింగిల్ విండో త్రీమన్ కమిటీ చైర్మన్‌గా శ్రీధర్ రెడ్డి కొనసాగారు. ఆయన రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కొత్త ప్రభుత్వం మారిన తర్వాత కేవీఆర్ కుమార్ నియమితులయ్యారు.

టెంపో ట్రావెలర్ బోల్తా

● ఒకరికి గాయాలు



గుడిపాల, జూన్ 29: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని అనుపు వద్ద శనివారం టెంపో ట్రావెలర్ బోల్తాపడింది. ఒకరికి గాయాలయ్యాయి. తెలంగాణకు చెందిన 10 మంది తిరుమల శ్రీవారిని దర్శించుకుని తమిళనాడులోని శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్‌కు వెళ్తుండగా అనుపు వద్ద బోల్తాపడింది. ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడిని దర్శించుకున్న తెలంగాణ మంత్రి



ఐరాల(కాణిపాకం), జూన్ 29: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

కలెక్టర్‌ను కలసిన రెవెన్యూ అసోసియేషన్ బృందం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: తిరుపతి రెవెన్యూ అసోసియేషన్ శనివారం సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. అసోసియేషన్ సభ్యులు ఆయనకు శాలువ కప్పి, మొక్కఉ బహూకరించారు. కలెక్టర్‌ను కల్సినవారిలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అన్వర్ బాషా, సెక్రటరి అశోక్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ట్రెజరర్ రూప్‌చంద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్ర గాయాలు

కార్వేటినగరం, జూన్ 29: ఆర్‌కేవీబీ పేట గ్రామ పంచాయితీ ఆది ఆంధ్రవాడలో విద్యుదాఘాతానికి ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన రాజేంద్ర శనివారం ఉదయం ఇంటి నిర్మాణం చే పడుతుండగా ఇంటి పై భాగంలో విద్యుత్ తీగలు తగిలాయి. వెంటనే షాక్‌కు గురై తీవ్ర గాయాలు పాలయ్యాడు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు. విద్యుత్ ఏఈ ప్రశ్నించగా నిర్మాణం చేపడుతున్నట్లు కనీస సమాచారం ఇచ్చినట్లయితే విద్యుత్ సరాఫరా నిలిపివేసి ఉండేవారమన్నారు.

మామిడి ఎగుమతులపై చర్చించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: మామిడి పంటలో స్థానిక వినియోగానికి పోగా మిగిలిన పండ్ల గుజ్జును విదేశాలకు చేస్తున్న ఎగుమతులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య కార్యదర్శి కట్టమంచి బాబి గోవర్దన్, తలుపులపల్లి బాబు రెడ్డి, సమీర్ శర్మలు జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సమాఖ్య ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డీడీ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైన్ సంఘం ఆధ్వర్యంలో నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, జూన్29: నగరంలో రాములగుడి వీధి జైన్ ప్రార్థనామందిరంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం11 గంటల వరకు ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జైన్ సంఘం అధ్యక్షులు సుభాష్ జైన్ తెలిపారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యులు పాల్గొని కంటి రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉచితంగా మందులు, కళ్ళద్దాలు పంపిణీ చేయనున్నామని తెలియజేశారు. అవసరమైన వారి చిత్తూరు జైన్ సంఘం కంటి ఆపరేషన్లు చేయిస్తుందని పేర్కొన్నారు.

నేడు గ్రంథావిష్కరణ

చిత్తూరు కల్చరల్, జూన్29: పుత్తూరు రోడ్డులోని విజయం కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం పత్తిపాటి శతక రత్రావళి గ్రంధావిష్కరణ కార్యక్రమం నిర్వహించనునారు. హరివిల్లు లలితా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళిలు ప్రధాన అతిథులుగా పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

● రెండు బస్ సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల



ఆర్టీసీ బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్

చిత్తూరు రూరల్, జూన్ 29: తమ ప్రభుత్వం ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకొస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో-2లో రెండు బస్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నాశనం చేసిందని విమర్శించారు. నాలుగేళ్లుగా ఆర్టీసీకి వైస్ చైర్మన్‌గా ఉన్న విజయానందరెడ్డి చేసిందేమి లేదన్నారు. అనేక గ్రామాలకు సర్వీసులను తొలగించారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే చిత్తూరుకు రెండు కొత్త సర్వీసులను తీసుకొచ్చామన్నారు. గతంలో మంజూరైన బస్సులను కూడా సీఎం, రవాణా శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి రప్పించుకుంటామన్నారు. ఆర్‌ఎంతో మాట్లాడి అవసరమున్న ప్రతి రూట్‌లో సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, దుకాణాలు తనిఖీ చేశారు. బాత్‌రూంలు అధ్వానంగా ఉన్నాయన్నారు. క్యాంటీన్లలో అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. మరోసారి తాను వచ్చేసరికి మారాలని అధికారులను ఆదేశించారు. ఆయన సరదగా బస్సును నడిపారు. కార్మికులు, ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు. ఆర్‌ఎం జితేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, 2డిపో మేనేజర్ రూపశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో సంతృప్తికర సేవలు



రవణయ్య దంపతులను సన్మానిస్తున్న ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: విధి నిర్వహణలో ప్రజలకు సంతృప్తికరమైన విధంగా సేవలందించి మన్ననలను పొందాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లాపరిషత్ కార్యాలయం ఆవరణంలో ఈఈ రవణయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఉద్యోగులు జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. పలువురు ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ రవణయ్య శేషజీవితం ఆనందమయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈఈ రవణయ్య దంపతులను శాలువ కప్పి సత్కరించారు. పీఆర్ ఈఈ చంద్రశేఖర్, ఏవో జి.వి. చలపతి, ఇంజినీర్లు, పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి



మాట్లాడుతున్న డీఐఈవో సయ్యద్ మౌల

చిత్తూరు (సెంట్రల్), జూన్ 29: టెన్త్ పాసైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించేలా చూడాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సయ్యద్ మౌల సూచించారు. శనివారం స్థానిక చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారన్నారు. అన్ని వసతులు, ప్రయోగశాలలు, ఆటస్థలాలు ఉన్నాయన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా విద్యార్థులకు ఉచితంగా విద్యతో పాటు పలు సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందిస్తోంరు. ఎంఈవో 1,2 సెల్వరాజ్, మోహన్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చదువు కొనసాగింపునకు 'అంబేడ్కర్ వర్సిటీ' చక్కని అవకాశం



ప్రిన్సిపాల్ జీవనజ్యోతిని సన్మానిస్తున్న విద్యార్థినులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 29: ఆర్థిక, సామాజిక, కుటుంబ, వివిధ సమస్యల ద్వారా కుంటుపడిన విద్యను కొనసాగించడానికి బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఒక చక్కటి అవకాశం ఇస్తుందని పీవీకేఎస్ డిగ్రీ కళాశాల పిన్సిపాల్ జీవన జ్యోతి పేర్కొన్నారు. శనివారం స్థానిక విశ్వవిద్యాలయం లెర్నర్ సపోర్ట్ సెంటర్‌లో 2021-24 బ్యాచ్ డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పట్టుదల, కృషితో విద్యను కొనసాగించడం జీవితాన్ని మలుపు తిప్పుతుందన్నారు. సమావేశంలో సెంటర్ కోఆర్డినేటర్ మీరా సాహెబ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 48 కేసుల పరిష్కారం



నగరి జూన్29: స్థానిక జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 48 కేసులు పరిష్కారమయ్యాయి. రూ. 48.12 లక్షల మేర సెటిల్‌మెంట్ చేశారు. న్యాయమూర్తి విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పలు సివిల్, బ్యాంకు కేసులు విచారణకు వచ్చాయి. ఏపీపీ రామశాంతి, బార్ అసోషియాషన్ ప్రెసిడెంట్ జగదీష్ న్యావాదులు చిరంజీవులుశెట్టి, త్యాగరాజు, సోము, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

వెదురుకుప్పం, జూన్ 29: పర్యావరణ పరిరక్షణంపై పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధయ్య, టీం లీడరు కామసాని చంద్రవనిత శనివారం అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులకు ఆధునిక బోధనోపకరణ వినియోగంపై పుత్తూరు సమీపంలోని వెంకట పెరుమాళ్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఈసీఈ విద్యార్థులకు సామాజిక సేవ ప్రాజెక్టును నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు.

ఘనంగా ఎమ్మెల్యే థామస్ జన్మదిన వేడుకలు



డాక్టర్ థామస్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

పాలసముద్రం, జూన్ 29: ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన వేడుకలను శుక్రవారం రాత్రి 12 గంటలకు మండలంలోని రేవా రిసార్ట్‌లో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు వేడుకలను నిర్వహించారు. క్రేన్ ద్వారా గజమాల వేశారు. కేక్ కట్‌చేసి శాలువ కప్పి సన్మానించారు. పార్టీ నాయకులు వాసు నాయుడు, జె. విజయ్‌కుమార్, శేఖర్ రాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాను ప్రకాష్‌కు సన్మానం



ఎమ్మెల్యేని సన్మానిస్నున్న బాబునాయుడు

నింద్ర, జూన్ 29: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను శనివారం నింద్ర మండలం అగరానికి చెందిన చెన్నై నివాసి గరుడ గ్రూప్ అధినేత రావిళ్ల బాబు నాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. ఆయనతో పాటు మాలేపాటి సంతోష్ నాయుడు తదితరులు ఉన్నారు.

వన వేణుగోపాలస్వామికి పాలాభిషేకం

వెదురుకుప్పం, జూన్ 29: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం పాలాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అక్కడి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు.

కాలభైరవస్వామికి విశేషపూజలు

నగరి జూన్29: స్థానిక కామాక్షిసమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో శనివారం కాలభైరవస్వామినపి వెన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అర్చనలు అభిషేకాలు చేశారు. వెన్నముద్దలు, ద్రాక్షపండ్లతో స్వామివారిని అలంకరించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

రైతులకు, కార్మికులకు న్యాయం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూన్ 29: షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు, రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగనోహన్ భరోసా ఇచ్చారు. మూతపడిన కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని శనివారం ఆయన కార్మికులు, ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులతో కలసి షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీని పునఃప్రారంభించడమా లేక ఇదే ప్రదేశంలో వేరే ఏదైనా పరిశ్రమ నెలకొల్పడమా అనే విషయాన్ని అధికారులు, నియోజకవర్గ పెద్దలు, రైతులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జి బాధ్యతల స్వీకరణ

నగరి జూన్29: నగరి సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జిగా చిత్తూరు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీఆర్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో త్రీమెన్ కమిటీలో భాగంగా సింగిల్ విండో అధ్యక్షుడిగా ఉన్న తిరుమలరెడ్డి వైసీపీ ఓటమితో రాజీనామా చేశారు. సింగిల్ విండో వ్యాపారలావాదేవీలు స్తంభించకుండా పాలకమండలి ఏర్పడే వరకు కుమార్ పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని సీఈఓ తులసిపిళ్లై పేర్కొన్నారు.

తాగునీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి

నగరి జూన్29:నగరి, నింద్ర విజయపురం మండలాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ విజయకుమార్ సూచనలిచ్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ల పరిసరాలలో శుభ్రతను పాటించాలన్నారు. 15 రోజులకో సారి ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. అతిసార,డయేరియా ప్రబలకుండా తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ సతీష్, ఏఈఈలు శైలేంద్ర, అంజేరయ్యశ్రీకాంత్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్లలో అక్రమాలపై విచారణ జరపండి: టీడీపీ



కలెక్టర్‌ను కలసిన టీడీపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: గత ఐదేళ్ళలో జిల్లాలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని జిల్లా టీడీపీ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. శనివారం కలెక్టర్‌ను టీడీపీ అధికారప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మాజీ ఎంపీపీ జయచంద్ర నాయుడు, నాయకులు మోహన్‌రాజ్, సురేష్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్‌శాఖలో దాదాపు 700 ఉద్యోగాల భర్తీకి ఎన్నికలకు ముందు లక్షలాది రూపాయిలు చేతులు మారాయని, వీటిపై విచారణ జరపాలని కోరారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇతర వైసీపీ నాయకుల పాత్రపై దృష్టిపెట్టాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో పెద్దఎత్తున నియామకాల అంశంపై వైసీపీ నాయకులు నిరుద్యోగులను మోసం చేసి డబ్బులు కాజేశారన్నారు. పూతలపట్టు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచి పేదవిద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

రిటైరైన అధికారులకు వీడ్కోలు సత్కారం



కలెక్టరేట్ ఏవోను సన్మానిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో రెవెన్యూ శాఖ ఉద్యోగులు కీలకపాత్ర వహిస్తారని డీఆర్వో పుల్లయ్య అన్నారు. రిటైరవుతున్న డిప్యూటీ కలెక్టర్లు ఎస్. శివయ్య, శకుంతల, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వరన్‌లకు శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో చేస్తున్న జిల్లా రెవిన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ముగ్గురు అధికారులను డీఆర్వో పుల్లయ్య, డ్వామాపీడీ రాజశేఖర్, అసోసియేషన్ నాయకులు సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వినతి



భానుప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నగరి జూన్29: తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ ,హెల్పర్స్ అసోసియేషన్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సంఘాలు శనివారం కలసి వినతిపత్రం సమర్పించాయి. తిరుపతిలోని ఆయన నివాసంతో ఆయన్ను ఈ సందర్భంగాసన్మానించాయి. ఉద్యోగ భద్రత కల్పించాలని, గత ప్రభుత్వంలో హామీలను అమలయ్యేలే చూడాలని వారు కోరారు. భానుప్రకాష్ స్పందిస్తూ తాను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. నాయకులు కస్తూరి, మునెమ్మ, విజయ, రమణమ్మ, శాంతి, పరిమళ, కృష్ణవేణి, శివగామి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యేను టీఆర్‌కండ్రిగలోని నేత్రప్రదాత దేశమ్మగుడి పూజారి పురుషోత్తం సన్మానించి తీర్థప్రసాదాలను అందశారు.